క్లుప్తంగా

రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీల్లో ప్రతిభ



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ఈనెల 19, 20వ తేదీల్లో విశాఖపట్నంలో జరిగిన 10వ జూనియర్, సబ్ జూనియర్ ఛాంపియన్ పోటీల్లో కేఎల్‌రావు స్విమ్మింగ్ పూల్‌కు చెందిన స్విమ్మర్ ఎస్.శృతి హర్షిక ప్రతిభ చూపిందని కోచ్ షేక్ రఫీ తెలిపారు. శనివారం కేఎల్‌రావునగర్‌లోని నగరపాలక సంస్థ స్విమ్మింగ్ పూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ప్రతిభ చూపిన శృతి హర్షికను కోచ్, తోటి స్విమ్మర్లు అభినందించారు. బాలికల విభాగంలో 50, 100 మీటర్ల బాక్ స్ట్రోక్స్‌లో మూడో స్థానంలో నిలిచి రెండు పతకాలను సాధించడం అభినందనీయమని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరిన్ని పోటీల్లో రాణించాలని ఆకాంక్షించారు. హర్షికను వీఎంసీ స్పోర్ట్స్ ఇన్‌చార్జి, జిల్లా స్విమ్మింగ్ సంఘం ప్రతినిధులు అభినందనలు తెలిపారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): భారత మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతిని పురస్కరించుకుని కొత్తపేట ఆంజనేయ వాగు సెంటర్‌లో విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేశారు. ఏపీజే అబ్దుల్ కలాం సేవా సమితి అధ్యక్షుడు వేముల వెంకట్రావు ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా కొత్తపేట సీఐ చిన కొండలరావు, లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ స్మైల్స్ ప్రతినిధులు ఎన్వీ రావు, నల్లాని సూర్యారావు విచ్చేశారు. అబ్దుల్ కలాం పేరిట సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్న వేముల వెంకట్రావును అతిథులు అభినందించారు. బీఎస్‌కే పట్నాయక్, శేఖర్‌బాబు, బాబూరావు, ప్రసాద్ పాల్గొన్నారు.

స్టాండింగ్ కమిటీ సభ్యులతో సమావేశం



పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని మేయర్ చాంబర్‌లో శనివారం నూతనంగా ఏర్పడిన స్టాండింగ్ కమిటీ సభ్యులతో మేయర్ రాయన భాగ్యలక్ష్మి సమావేశం నిర్వహించారు. ఈ నెల 28న జరగబోవు స్టాండింగ్ కమిటీ సమావేశం ఎజెండాపై ఈ సమావేశంలో సమీక్షించారు. నూతనంగా ఏర్పడిన స్టాండింగ్ కమిటీ సభ్యులను మేయర్ సన్మానించారు. సమావేశంలో స్టాండింగ్ కమిటీ సభ్యులు అలంపూర్ విజయలక్ష్మి, మహమ్మద్ రెహానా నహీద్, పుప్పల నరస కుమారి, శీరంశెట్టి పూర్ణచంద్రరావు, షేక్ రహమతున్నీసా, వుద్దంటి సునీత పాల్గొన్నారు.

నూతన ఆవిష్కరణలపై దృష్టి పెట్టాలి



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విద్యార్థులు నూతన ఆవిష్కరణలపై దృష్టి పెట్టినప్పుడు మంచి భవిష్యత్‌ను సొంతం చేసుకుంటారని పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కార్యదర్శి చిట్టా అమర్‌సుధీర్ అన్నారు. ఆ కళాశాల కంప్యూటర్స్ విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇన్‌సెప్టా క్లబ్‌ను శనివారం చిట్టా అమర్ సుధీర్ ప్రిన్సిపాల్ ఎస్.శరవణకుమార్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ విద్యార్థుల నూతన ఆవిష్కరణలు, పరిశోధనలకు వేదికగా ఈ క్లబ్ పని చేస్తుందన్నారు. విద్యార్థుల్లో ఆసక్తిని పెంపొందించేందుకు దీనిద్వారా కృషి జరుగుతుందన్నారు. ఈ విధమైన విభాగాలను విద్యార్థులు పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలన్నారు. క్లబ్ ద్వారా థీమ్ ప్రదర్శనలు, పరిచయ కారయక్రమాలు ఇతర అవగాహనా చర్చా వేదికలను నిర్వహిస్తామన్నారు. కంప్యూటర్స్ విభాగ అధ్యాపకులు పాల్గొన్నారు.

వ్యక్తిపై దాడి- కేసు నమోదు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఇంటి యజమానిపై అద్దెకు ఉండే వ్యక్తి దాడి చేసిన ఘటన భవానీపురంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు..భవానీపురం టీచర్స్ కాలనీకి చెందిన కొల్లిపర శ్రీనివాసరావు 2015లో నాగార్జునవీధిలో దాసరి ప్రభాకరరావు అనే వ్యక్తి ఇంటిని కొనుగోలు చేశాడు. అనంతరం కొన్నాళ్ల తర్వాత దాసరి ప్రభాకరరావు అదే ఇంటిని అద్దెకు తీసుకున్నాడు. ఈక్రమంలో రెండు నెలలపాటు సక్రమంగా అద్దె చెల్లించిన ప్రభాకరరావు, తర్వాత అద్దె ఇవ్వడం లేదు. దీంతో ఇంటి యజమాని శ్రీనివాసరావు కోర్టులో కేసు వేసి గెలిచాడు. ఈక్రమంలో శనివారం మధ్యాహ్నం సమయంలో శ్రీనివాసరావు పక్క ఇంటివారికి హద్దులు చూపుదామని ఇంటివద్దకు వెళ్లగా అద్దెకు ఉంటున్న దాసరి ప్రభాకరరావు, అతని భార్య రాధిక కలిసి అతనిపై రాడ్డుతో దాడి చేయడంతో గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న శ్రీనివాసరావు భార్య సంఘటన స్థలానికి చేరుకుని తనభర్తను ఆటోలో ప్రైవేటు ఆసుపత్రికి తరలించింది. ఇంటియజమాని కొల్లిపర శ్రీనివాసరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సంక్షామ నిలయం

- కటిక నేలపైనే నిద్ర..
- అరకొరగా బెడ్‌షీట్లు, దుప్పట్లు!
- పరిసరాలు కూడా అధ్వానం
- లంబాడీపేట హాస్టల్ దుస్థితి



లంబాడీపేటలోని సాంఘిక సంక్షేమ వసతి గృహం



చిరిగిన పరుపుపై పడుకున్న విద్యార్థి

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షంతో నేల చల్లబడింది.. కటిక నేలపై దుప్పటే దిక్కయింది.. ఆ విద్యార్థులకు. లంబాడీపేటలోని సాంఘిక సంక్షేమ హాస్టల్‌లో విద్యార్థుల దీనస్థితి ఇది.

పైన పటారం.. లోపల అసౌకర్యం

లంబాడీపేట సాంఘిక సంక్షేమ హాస్టల్‌లో 79 మంది విద్యార్థులు వసతి పొందుతున్నారు. విద్యార్థులు నివాసం ఉండే భవనం బాగానే ఉన్నా లోపల వారికి సరైన సదుపాయాలు లేవు. విద్యార్థులు నిద్రపోయేందుకు దుప్పట్లు మినహా ఇతర ఏవీ లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

అరకొరగా వసతులు

కొంత మంది విద్యార్థులు తమ ఇంటి నుంచి బెడ్‌షీట్లను తెచ్చుకుని వినియోగిస్తుండగా, మరి కొంత మంది పరుపులను వినియోగిస్తున్నారు. అయితే వసతి పొందుతున్న వారిలో ఎక్కువ మందికి అరకొరగా ఉన్న దుప్పట్లతోనే కాలం వెళ్లదీస్తున్నారు. ప్రస్తుతం ఉన్న దుప్పట్లు కూడా నిండా మనిషి కప్పుకునేందుకు సరిపోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చలి వాతావరణంలో ఎలా?

మారిన వాతావరణంతో ఇదే విధంగా మరి కొన్ని రోజులు పడుకుంటే జ్వరాలు, జలుబు చేసే ప్రమాదం ఉందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరో మూడు రోజులు తుఫానుతో వర్షాలు కురిసే అవకాశం ఉందని, ప్రభుత్వం తమకు తగినన్ని దుప్పట్లు అందించాలని విద్యార్థులు కోరుతున్నారు. హాస్టల్ ఎదుట ఖాళీ ప్రదేశంలో వర్షం నీరు నిలిచి బురదమయంగామారింది. మరో వైపున పిచ్చి మొక్కలు పెరిగిపోవడంతో దోమలు ఎక్కువగా ఉన్నాయని అంటున్నారు. హాస్టల్ ఆవరణలో ఉన్న ఖాళీ స్థలం శుభ్రం చేసి వినియోగింలోకి తెచ్చేందుకు అధికారులను అనుమతి కోరినట్లు వార్డెన్ నాగరాజు తెలిపారు.

మోసపూరిత హామీలతో గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వం



బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ క్యూఆర్ కోడ్ ఆవిష్కరించిన వెలంపల్లి శ్రీనివాసరావు, కార్పొరేటర్ కోటిరెడ్డి, పార్టీ నాయకులు

మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కన్నా మెరుగైన పాలన అందిస్తామని, పథకాలు కొనసాగిస్తామని మోసపూరిత హామీలతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు పేర్కొన్నారు. స్థానిక 43వ డివిజన్ హెచ్‌బీ కాలనీ వీఎంసీ కల్యాణ మండపంలో శనివారం బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వెలంపల్లి పాల్గొని పార్టీ నాయకులు, కార్యకర్తలకు రీకాలింగ్ చంద్రబాబూస్ మేనిఫెస్టోను వివరించారు. జిల్లా నుంచి డివిజన్ స్థాయి వరకు బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వం అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పథకాలు అందించిందన్నారు. గడప గడపకు వెళ్లి అర్హులకు పథకాలు వస్తున్నాయో రాలేదో తెలుసుకొని మరీ అమలు చేయడం జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వం వైఎస్సార్ సీపీ పథకాలను కాపీ కొట్టిందన్నారు. కానీ ఏడాది గడుస్తున్నా వాటిని అమలు చేయడం లేదన్నారు. 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా చేసిన చంద్రబాబు హామీలను ఏ ఒక్కరూ నమ్మే వారు కాదన్నారు. కానీ 2024 ఎన్నికల్లో ష్యూరిటీ, గ్యారెంటీ అంటూ సంతకాలు చేసిన బాండ్లు ఇచ్చి ప్రజలను నమ్మించారన్నారు. పైగా 2024 జూన్ నుంచే అమలవుతాయని ప్రజలను వంచించారని చెప్పారు. ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి తల్లికి వందనం ఇస్తామని హామీ ఇచ్చి తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత మొదటి ఏడాది ఎగ్గొటి.. ఈ ఏడాది అరకొరగా ఇచ్చారని తెలిపారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలను ప్రతి ఒక్కరికీ వివరించాలని సూచించారు.

పథకాలు ఎగ్గొట్టేందుకు కుట్ర

గత ప్రభుత్వం పథకాలు ఇచ్చినప్పుడు రాష్ట్రాన్ని అమ్మేయలేదని, కానీ ఇప్పుడు పథకాలు అడుగుతుంటే రాష్ట్రాన్ని అమ్మేయాలంటూ మంత్రులు మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. పథకాలన్నీ ఎగ్గొట్టేందుకు ఇటువంటి వ్యాఖ్యలు చేస్తున్నారన్నారు. విద్యుత్ చార్జీలు బాదుడే బాదుడు, ట్రాఫిక్ చలానాల మోత మోగిపోతోందన్నారు. ఇదేనా సంపద సృష్టి అంటే చంద్రబాబును ప్రశ్నించారు. వైఎస్ జగన్ ఐదేళ్ల పాలనలో ఏనాడు భారాలు మోపలేదన్నారు. కరోనా కష్టం కాలంలోనూ సంక్షేమ పథకాలు కొనసాగించారని గుర్తు చేశారు. 13 నెలల పాలనలో కూటమి లక్షల కోట్లు అప్పులు చేసిందన్నారు. ఏ ఒక్క పథకం కూడా అమలు చేయకుండా అప్పులు ఎందుకు చేశారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. వైఎస్సార్ సీపీ కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మాట్లాడి పథకాలు గుర్తు చేయాలని సూచించారు. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయించి ప్రజల్లో చైతన్యం తేవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో డివిజన్ కార్పొరేటర్ బాపతి కోటిరెడ్డి, పార్టీ క్లస్టర్ అధ్యక్షుడు కేసరి కృష్ణారెడ్డి, కనకం వెంకటేశ్వర్లు యాదవ్, అన్నపురెడ్డి కృష్ణారెడ్డి, కంది శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నగర సమగ్రాభివృద్ధిలో ఎన్‌ఆర్‌వీలు భాగస్వాములు కండి

–కలెక్టర్ లక్ష్మీశ



ఎన్ఆర్వీలు, సిద్ధార్థ కళాశాల ప్రతినిధులతో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విజయవాడ నగర సమగ్రాభివృద్ధిలో నాన్ రెసిడెంట్ విజయవాడయన్స్) భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ పిలుపునిచ్చారు. కలెక్టరేట్‌లో శనివారం కలెక్టర్ జి.లక్ష్మీశ ఎన్ఆర్‌వీలతో పాటు పీబీ సిద్ధార్థ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సైన్సెస్ అలుమ్ని అసోసియేషన్ ప్రతినిధులతో విజయవాడ నగర అభివృద్ధి, పీ4 విధానంపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆధ్యాత్మిక, సాంస్కృతిక, సాహిత్య, పర్యాటక కేంద్రంగా విరాజిల్లిన విజయవాడకు కొత్త వైభవం తీసుకొచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోందని, ప్రజాప్రతినిధులు, అధికారులు సమష్టిగా వైబ్రెంట్ విజయవాడకు కృషిచేస్తున్నట్లు తెలిపారు. విజయవాడ అభివృద్ధికి అందరి సలహాలు, సూచనలతో ముందుకు వెళుతున్నామన్నారు. నగరానికి ఓ బ్రాండ్ తీసుకొచ్చేలా కృషిచేస్తున్నామని, బ్రాండ్ టైటిల్, ట్యాగ్‌లైన్ కోసం ఇప్పటికే ఔత్సాహికుల నుంచి ఎంట్రీలు ఆహ్వానించామన్నారు. ప్రస్తుత పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా యువతలో నైపుణ్యాల వృద్ధికి, ఉపాధి సృష్టికి, ఉద్యోగాల కల్పనపై ప్రత్యేకంగా దృష్టిసారించామన్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్రజల ఆరోగ్య భద్రత లక్ష్యంగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధాన్ని పటిష్టంగా అమలుచేస్తున్నామని, క్లీన్ ఎయిర్ ప్రాజెక్టులను కూడా చేపట్టినట్లు కలెక్టర్ వివరించారు. దసరా ఉత్సవాల సమయంలో విజయవాడ ఉత్సవ్‌ను ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. పేదరిక నిర్మూలనకు అమలు చేస్తున్న పీ4 విధానంలో మార్గదర్శులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. బంగారు కుటుంబాల అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాభివృద్ధి, ఉపాధి, స్వయం ఉపాధి, ఆరోగ్య అవసరాలు వంటివాటి విషయంలో మార్గదర్శులు చేయూతనిచ్చి, పేదరికం నుంచి బయటపడేలా చేస్తారని.. ఎన్ఆర్‌వీలతో పాటు పీబీ సిద్ధార్థ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సైన్సెస్ అలుమ్ని అసోసియేషన్ కూడా బంగారు కుటుంబాలకు మార్గదర్శులుగా ముందుకురావాలని కోరారు. కలెక్టర్ విజ్ఞప్తి మేరకు ఎన్ఆర్వీలు సానుకూలంగా స్పందించారు. ఎన్ఆర్‌వీలు పి.సురేష్, వై.మణిధర్, హర్షసాయి, పీబీ సిద్ధార్థ కళాశాల పూర్వ విద్యార్థుల అసోసియేషన్ ప్రతినిధులు స్వరూప్, ఎ.ప్రశాంత్ చౌదరి, జీఎస్‌సీ బోస్, సుమబిందు అట్లూరి తదితరులు పాల్గొన్నారు.

విజయదివస్ భారతీయులకు స్ఫూర్తి



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కార్గిల్ విజయ్ దివస్ కోట్లాది భారతీయులకు స్ఫూర్తినిస్తుందని బీజేపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ మధుకర్‌జీ అన్నారు. కార్గిల్ విజయదివస్‌ను పురస్కరించుకొని జిల్లా బీజేపీ ఆధ్వర్యంలో కేబీఎన్ కళాశాల విద్యార్థులు, బీజేపీ నేతలు శనివారం ర్యాలీని నిర్వహించారు. ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ర్యాలీలో బీజేపీ నేత మధుకర్‌జీ, పశ్చిమ ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్, రిటైర్డ్ ఆర్మీ సైనికులు కేకే నరసింహారావు, కే ఆనందరావు, యోహాను, మహమ్మద్, కేబీఎన్ కళాశాల అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ నారాయణరావు, ప్రిన్సిపాల్ కృష్ణవేణి, కార్యదర్శి టీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. కార్గిల్ యుద్ధంలో అమరులైన భారత సైనికులకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కార్పొరేటర్ బుల్లా విజయ్ కుమార్, బీజేపీ నేతలు కొలపల్లి గణేష్, పిట్టల గోవింద్, నున్న కృష్ణ, పైలా సురేష్, అవ్వారు బుల్లబ్బాయి, పచ్చిపులుసు శివప్రసాద్, కిలారు దిలీప్, మువ్వల సుబ్బయ్య, షేక్ బాషా, ప్రపుల్లా, బీ సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నగరంలో నటి తేజశ్వి సందడి



లబ్బీపేట(విజయవాడతూర్పు): నగరంలో సినీ నటి తేజశ్వి సందడి చేసింది. ఎంజీ రోడ్డులో బెంజిసర్కిల్ సమీపంలో ఏర్పాటుచేసిన ఇకోలక్స్ డైమండ్ జ్యూవెలరీ షోరూమ్‌ను శనివారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమెను చూసేందుకు అభిమానులు పెద్ద సంఖ్యలో విచ్చేశారు. కార్యక్రమంలో సేవా భారతి సంయుక్త కార్యదర్శి నాగలక్ష్మి పాతి, ఫిక్కీ ఫ్లో సభ్యురాలు లలితా పాతి, కస్టమర్ కోర్టు సభ్యురాలు దారా కరుణశ్రీ, డేటా అనలిస్టు సౌజన్య కంచర్ల ప్రత్యేక అతిథులుగా పాల్గొన్నారు. ప్రారంభోత్సవం సందర్భంగా ఈ నెలాఖరు వరకూ ప్రత్యేక ఆఫర్లు ఉన్నట్లు నిర్వాహకులు సిద్ధాంత్ సంగ్వీ, ప్రతీక్ కోఠారి తెలిపారు.

నిరంతరాయంగా డీసిల్టింగ్ పనులు చేయాలి



కృష్ణవేణి క్లాత్‌మార్కెట్ వద్ద డీసిల్టింగ్ పనులను పరిశీలిస్తున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు): నగరంలో వివిధ ప్రాంతాల్లో ఉన్న డ్రెయిన్లలో నిత్యం డీసిల్టింగ్ పనులు జరగాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. నగర పర్యటనలో భాగంగా ఆయన శనివారం బందర్ రోడ్, నిర్మల కాన్వెంట్ రోడ్, పిన్నమనేని పాలీ క్లినిక్ రోడ్, ఎన్టీఆర్ సర్కిల్, ఏలూరు రోడ్, వన్ టౌన్ లో బ్రిడ్జి, బీఆర్టీ రోడ్డు, నెహ్రూ రోడ్, పంజా సెంటర్, కృష్ణవేణి క్లాత్ మార్కెట్ ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన వర్షాకాలం నేపథ్యంలో రోడ్డుపైన నీటి నిల్వలు ఉండకుండా ఉండేందుకు నగరంలో మాన్సూన్ రెస్పాన్స్ టీం (వర్షాకాల స్పందన బృందం) ఏర్పాటు చేసినప్పటికీ, డీసిల్టింగ్ పనులు నగరంలో నిరంతరాయంగా జరుగుతుండాలని అన్నారు. డీవీ మేనర్ రోడ్డు వద్ద ప్యాచ్ వర్క్ చేయాలని, గుంతలను త్వరగా పూడ్చాలని అన్నారు. నగరంలో వీధి వ్యాపారస్తులకు జోనింగ్ పూర్తిస్థాయిలో చేసి వారికి జోన్‌లను ఏర్పాటు చేయాలని అన్నారు. పాడైపోయిన ఫుట్‌పాత్‌లను త్వరగా మరమ్మతులు చేయాలని, జమ్మి చెట్టు సెంటర్‌లో వర్షపు నీరును బందర్ రోడ్డు వైపు మళ్లించేందుకు చర్యలు తీసుకునేటట్టు ఇంజినీరింగ్ అధికారులు ప్రణాళికను సిద్ధం చేయాలని ఆదేశించారు. సైన్ బోర్డులను ప్రతి చోట అమర్చాలని, ప్రతి జంక్షన్ సంపూర్ణంగా కనపడేలా సైన్ బోర్డులను పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయమని టౌన్ ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. లో బ్రిడ్జి పాడైపోవడం గమనించి ఇంజినీరింగ్ అధికారులు త్వరగా మరమ్మతులు చేపట్టాలని, ఇరిగేషన్ శాఖాధికారుల సమన్వయంతో పనులు పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు.

ఫ్లాట్స్ యజమానులకు అండగా నిలబడతాం


- స్థానిక ఎంపీ, ఎమ్మెల్యే బాధితులకు న్యాయం చేయాలి
- వైఎస్సార్ సీపీ పశ్చిమ ఇన్‌చార్జి వెలంపల్లి శ్రీనివాసరావు



బాధితుల నుంచి వినతి పత్రం అందుకుంటున్న వెలంపల్లి

భవానీపురం(విజయవాడపశ్చిమ): రెండు దశాబ్దాల క్రితం స్థలాలు కొనుగోలు చేసి పక్కా గృహాలు నిర్మించుకుని నివసిస్తున్న 42 ఫ్లాట్లకు సంబంధించి తప్పుడు పత్రాలు సృష్టించిన కొందరు సంఘ విద్రోహ శక్తులు వాటిని కబ్జా చేసేందుకు కుట్రపూరిత చర్యలకు పాల్పడుతున్నారని వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలంపల్లి శ్రీనివాసరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. వారి న్యాయపోరాటానికి వైఎస్సార్ సీపీ తరఫున తాము అండగా నిలబడతామని స్పష్టం చేశారు. స్థానిక జోజినగర్ కరెంట్ ఆఫీస్ రోడ్‌లోగల 42 ఫ్లాట్ల యజమానులు తమకు న్యాయం చేయాలంటూ గత 24 రోజులుగా చేస్తున్న పోరాటానికి ఆయన సంఘీభావం తెలుపుతూ శనివారం టెంట్ వద్దకు వచ్చారు. ఈ సందర్భంగా 42 ఫ్లాట్ల యజమానులు ఆయనకు వినతి పత్రం అందజేయగా వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం వెలంపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇరవై ఏళ్ల పైబడి ఉంటున్నవారికి ఉన్నట్టుండి నోటీసులు ఇవ్వడం, ఖాళీ చెయ్యాలని దౌర్జన్యం చేయడం బాధాకరమన్నారు. దీని వెనుక కొందరు అధికార పార్టీకి చెందిన నాయకులు ఉన్నారన్న అనుమానాలు కలుగుతున్నాయని, స్థానిక ఎంపీ, ఎమ్మెల్యే ఇక్కడికి వచ్చి పరిశీలించి బాధితులకు న్యాయం చేయాలని కోరారు. లేని పక్షంలో వారికి కూడా వాటాలు ఉన్నట్లు భావించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. స్థలాలు కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేయించుకున్నామని బాధితులు చెబుతుండగా, వేరేవారికి ఎలా రిజిస్ట్రేషన్ అయ్యాయో జిల్లా కలెక్టర్ పరిశీలించి వారికి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ 45వ డివిజన్ బాధ్యులు సరగడ శంకరరెడ్డి, పార్టీ నాయకులు గోదావరి బాబు, వెన్నం రజని, దిద్దుకూరి శివ, ఫ్లాట్ల యజమానులు పాల్గొన్నారు.

డ్రెయిన్లపై ఆక్రమణలు తొలగించాలి



డ్రెయిన్లను పరిశీలిస్తున్న మంత్రి నారాయణ

పటమట(విజయవాడతూర్పు): నగరంలో డ్రెయిన్లపై ఆక్రమణలను తొలగించాలని మంత్రి పొంగూరు నారాయణ అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన నగరంలో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డ్రెయిన్ల ఆక్రమణలను వెంటనే మార్కింగ్ చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. గుణదల పుల్లేటికట్ట, దర్శిపేట, ఫకీరు గూడెంలో అవుట్ ఫాల్ డ్రెయిన్లు, బెంజిసర్కిల్ ఫ్లై ఓవర్ దిగువన వర్షం నీరు నిల్వ ఉండే ప్రాంతాలతో పాటు ఆటోనగర్ లోని వీఎంసీ శాటిలైట్ స్టేషన్‌ను మంత్రి నారాయణ పరిశీలించారు. కొన్ని చోట్ల డ్రెయిన్లు వెడల్పుగా ఉండగా, మరికొన్ని చోట్ల ఇరుకుగా ఉండటంపై అధికారులను వివరణ అడిగారు. చాలా ప్రాంతాల్లో ఇళ్ల నిర్మాణాలతో పాటు ప్రహరీగోడలు అవుట్ ఫాల్ డ్రెయిన్లను ఆక్రమించి నిర్మించడాన్ని గుర్తించి అవుట్ ఫాల్ డ్రెయిన్లు ప్రవాహానికి ఇబ్బందిగా మారిన అక్రమ కట్టడాలు తొలగించాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్రను ఆదేశించారు. ఆక్రమణలు ఉన్న ప్రాంతాల్లో స్థానిక ప్రజాప్రతినిధులతో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని, ఎవరైనా ఇళ్లు కోల్పోతుంటే వారికి టిడ్కో ఇళ్లను కేటాయించాలని అధికారులను ఆదేశించారు. వీఎంసీ, సీఆర్డీయే నిధులతో విజయవాడలో డ్రైనేజీ వ్యవస్థ మెరుగు చేస్తామని, సెప్టెంబర్ నుంచి పనులు ప్రారంభించి 6 నెలల్లో పూర్తి చేసి వచ్చే వర్షాకాలం నాటికి విజయవాడ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తామని మంత్రి నారాయణ తెలిపారు. బుడమేరు ఆక్రమణలపై ఇరిగేషన్ శాఖ సాంకేతిక కమిటీని నియమించిందని, ఆ కమిటీ త్వరలో నివేదిక ఇస్తుందన్నారు. బుడమేరును వెడల్పు చేయడమా లేదా గట్లు ఎత్తు పెంచడమా అనే దానిపై కూడా టెక్నికల్ కమిటీ పరిశీలిస్తుందన్నారు. విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఇరిగేషన్ అధికారులతో సమన్వయం చేసుకుని త్వరలో ఓ నిర్ణయం తీసుకుంటారని తెలిపారు. ఈ పర్యటనలో ప్రజారోగ్య విభాగం ఇంజినీర్ ఇన్ చీఫ్ ప్రభాకర్, వీఎంసీ చీఫ్ ఇంజినీర్ శ్రీనాథ్ రెడ్డి, ఇతర ఇంజినీర్లు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం

కృష్ణలంక(విజయవాడతూర్పు): షార్ట్ సర్క్యూట్ కారణంగా విద్యుత్ స్తంభానికి ఉన్న కేబుల్ వైర్లు అగ్నికి ఆహుతయ్యాయి. ఈ ఘటన కృష్ణలంక, పోలీస్ కాలనీలోని మెయిన్‌రోడ్డులో జరిగింది. శనివారం తెల్లవారుజాము 3 గంటల సమయంలో భారీ ఈదురు గాలులు రావడంతో షార్ట్ సర్క్యూట్ జరిగి విద్యుత్ స్తంభానికి ఉన్న సర్వీస్ వైర్లకు, నెట్ కేబుల్ వైర్లకు మంటలు అంటుకున్నాయి. మంటలు ఎగిసిపడడాన్ని గమనించిన స్థానికులు అప్రమత్తమై మంటలు వ్యాపించకుండా నీళ్లు చల్లి అదుపుచేశారు. విద్యుత్ శాఖ సిబ్బంది విద్యుత్‌ను నిలిపి వేశారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఫైర్ ఇంజన్‌తో ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు.

బీసీల మహాధర్నా జయప్రదం చేయాలి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బీసీ నేతలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): బీసీ హక్కుల పరిష్కారం కోసం జాతీయ స్థాయిలో ఆగస్టు 18, 19వ తేదీలలో ఢిల్లీలో జరిగే మహా ధర్నాకు బీసీలందరూ వేలాదిగా తరలిరావాలని పలువురు బీసీ నేతలు పిలుపునిచ్చారు. చిట్టినగర్‌లోని శ్రీనగరాల మహాలక్ష్మీ అమ్మవారి ఆస్థాన కల్యాణ మండపంలో బీసీ సంక్షేమ సంఘ నేతలు మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం ఏపీ ఇన్‌చార్జి వై.నూకాలమ్మ, రాష్ట్ర అధ్యక్షుడు వై.నాగేశ్వరరావు, జనరల్ సెక్రటరి కనిశెట్టి లక్ష్మణరావు, లీగల్ సెల్ సలహాదారు పిళ్లా శ్రీనివాసరావు నేతలు పోస్టర్‌ను ఆవిష్కరించారు. నేతలు మాట్లాడుతూ సంఘ జాతీయ అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య ఆధ్వర్యంలో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద మహా ధర్నా నిర్వహించనున్నామన్నారు. బీసీలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని, బీసీ హక్కుల సాధనకు చేపట్టిన ధర్నాలో వేలాదిగా పాల్గొనాలని కోరారు. సంఘ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు నమ్మి భానుప్రకాష్, బాడిశ రూపేష్, తమ్మిన దుర్గారావు, పీసా అరుణ్‌కుమార్, సత్యాల సతీష్, జి.లీల పాల్గొన్నారు.

ప్రేమించకపోతే చంపేస్తా!

డిగ్రీ విద్యార్థినిని వెంటపడి వేధిస్తున్న యువకుడు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ప్రేమిస్తానని వెంటపడడమే కాకుండా.. తనను ప్రేమించకపోతే చంపేస్తానంటూ డిగ్రీ విద్యార్థినిని బెదిరించిన యువకుడిపై అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సింగ్‌నగర్ డంపింగ్ యార్డ్ సమీపంలోని జీ ప్లస్‌త్రీ ఇళ్లల్లో నివసిస్తున్న గోవిందరాజు ఆటో డ్రైవర్‌గా పనిచేస్తుంటాడు. ఇతనికి ముగ్గురు కుమార్తెలు సంతానం. రెండో కుమార్తె ఇటీవలే డిగ్రీ పూర్తి చేసి ఇంటివద్దే ఉంటుంది. అయితే అదే ప్రాంతానికి చెందిన పువ్వుల చందన అనే వ్యక్తి గత కొన్ని నెలల నుంచి ప్రేమ పేరుతో ఆమె వెంట పడుతూ వేధిస్తూ ఉండేవాడు. దీంతో రెండు నెలల క్రితం యువతి తల్లిదండ్రులు, స్థానిక పెద్దలు పిలిచి హెచ్చరించారు. అయితే మరల అతగాడు యువతి ఇంటి బయటకు వచ్చినా, పాలప్యాకెట్‌లు, సరుకులు కోసం వెళ్లినా వెంటబడి తనను ప్రేమించాల్సిందేనని, లేకపోతే చంపేస్తానని బెదిరిస్తున్నాడు. దీంతో భయభ్రాంతులకు గురైన యువతి విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పడంతో వారు పోలీసులను ఆశ్రయించారు. యువతి ఫిర్యాదుమేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దసరా ఉత్సవ ఏర్పాట్లపై సమీక్ష

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దసరా ఉత్సవాల ఏర్పాట్లపై దుర్గగుడి ఈవో శీనానాయక్ శనివారం ఆలయ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మహామండపంలోని నాల్గో అంతస్తులో ఈవో ఛాంబర్‌లో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశానికి ఆలయ ఏఈవోలు, సూపరింటెండెంట్లు, ఇంజినీరింగ్ అధికారులు, ఆలయ అర్చకులు హాజరయ్యారు. తొలుత ఆలయ ఈవో శీనానాయక్, ఇంజినీరింగ్ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేశారు. వీఎంసీ కార్యాలయం, సీతమ్మ వారి పాదాలు, స్నానఘాట్లతో పాటు కనకదుర్గనగర్‌ను పరిశీలించారు. ఉత్సవాల నేపథ్యంలో ఏర్పాటు చేసే క్యూలైన్లు, ప్రసాదాల కౌంటర్లు, వీఐపీ టికెట్ కౌంటర్ల గురించి ఆలయ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం టోల్‌గేట్, ఓం టర్నింగ్, ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసే క్యూలైన్ల గురించి అధికారులతో చర్చించారు.

అధికారులతో సమీక్ష

దసరా ఉత్సవాల ఏర్పాట్లపై ఈవో సమీక్ష చేశారు. గతంలో ఉత్సవాల నేపథ్యంలో చేసిన ఏర్పాట్లు, భక్తుల సంతృప్తిపై చర్చించారు. అమ్మవారి దర్శన వేళలతో పాటు వీఐపీ, సిఫార్సు లేఖలపై ప్రస్తావించారు. 29వ తేదీన జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగే సమావేశానికి కార్యచరణ రూపొందించాలని ఆదేశించారు. సమీక్ష సమావేశంలో ఆలయ ఏసీ రంగారావు, ఏఈవోలు ఎన్.రమేష్‌బాబు, వెంకటరెడ్డి, ఈఈలు, ఏఈవోలు, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.